క్లుప్తంగా

సొసైటీ డైరెక్టర్‌గా రామారావు

జూలూరుపాడు: స్థానిక సహకార సంఘం కార్యాలయంలో గురువారం డైరెక్టర్ ఎన్నిక జరిగింది. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు లేళ్ల వెంకటరెడ్డిని డిస్ క్వాలిఫై చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం విదితమే. దీంతో 9వ వార్డు డైరెక్టర్ స్థానం ఖాళీ ఏర్పడింది. డీసీఓ సయ్యద్ ఖుర్షిద్ ఆదేశాలతో ఖాళీ ఏర్పడిన డైరెక్టర్ స్థానంలో వెంగన్నపాలెం గ్రామానికి చెందిన శీరంశెట్టి రామారావును డైరెక్టర్‌గా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు యల్లంకి సత్యనారాయణ, కొమ్మినేని పాండురంగారావు, చాపలమడుగు రామ్మూర్తి, లకావత్ హేమ్లా, పాపిన్ని వెంకయ్య, రెడ్డిబోయిన రాము, ఎం.తిరువెంగళరాజు, కళ్లోజి రజనీ, భూక్యా జవహర్ లాల్, సీఈఓ రమణారెడ్డి పాల్గొన్నారు.

టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్

పాల్వంచ: టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పాల్వంచకు చెందిన చారుగుండ్ల రమేశ్ నియామకమయ్యారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని టీఆర్‌వీకేఎస్ కేంద్ర కార్యాలయంలో కార్యవర్గల సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత స్థానంలో మాజీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కోడూరి ప్రకాశ్‌ను నియమించారు. అదేవిధంగా సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల రమేశ్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

ఎంపీడీఓకు ఉత్తర్వులు అందజేత

చుంచుపల్లి: మెదక్ జిల్లా నుంచి జిల్లాకు బదిలీపై వచ్చిన మండల పరిషత్ అభివృద్ధి అధికారిని లలిత కుమారిని దుమ్ముగూడెం నుంచి డిప్యూటేషన్‌పై కొత్తగూడెం జిల్లా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు అనుమతిస్తూ కలెక్టర్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేయగా ఆ ఉత్తర్వులను జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు గురువారం ఎంపీడీఓ లలిత కుమారికి అందజేశారు.

పీహెచ్‌సీ తనిఖీ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సందర్శించారు. ఆస్పత్రిలో ప్రతీనెల జరుగుతున్న కాన్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి చైతన్య మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. గట్టుమళ్లలో ఎఫ్ ఫార్మ్ ఆడిట్ నిర్వహించారు. డిప్యూటీ డెమో ఎండీ ఫైజిమొహీద్దిన్, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్ తదితరులు ఉన్నారు.

ఇందిరాగాంధీ విగ్రహాన్ని పునఃనిర్మించాలి

పాల్వంచ: స్థానిక దమ్మపేట సెంటర్‌లో రోడ్ల విస్తరణలో భాగంగా తొలగించిన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని పునఃనిర్మించడానికి సహకరించాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ ఎ.స్వామిని కలిసి కోరారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ... రోడ్డు పనులు పూర్తయినప్పటికీ వరుస ఎన్నికల వల్ల కోడ్ ఉన్నందున ఆ పనులు ఆగాయని చెప్పారు. యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, కాల్వ భాస్కర్‌రావు, వెంకటాచారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం కొత్తగూడెంలోని కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ హేమచంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బర్మా క్యాంపు, బాబు క్యాంపు, బర్లీఫిట్, సన్యాసి బస్తీ, మధురబస్తీ, బస్టాండ్ ఏరియా, రైటర్ బస్తీ, గొల్లగూడెం, రామాటాకీస్ ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కుట్టు మిషన్లు పంపిణీ చేయాలి

కొత్తగూడెంఅర్బన్: గత ప్రభుత్వంలో పేద మైనార్టీ వర్గాల మహిళలకు మంజూరైన కుట్టు మిషన్లను వెంటనే పంపిణీ చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 100 మందికి 500 మంది మహిళలకు కుట్టు మిషన్లు కేటాయించి అర్హులైన వారి జాబితాను కూడా రూపొందించినట్లు తెలిపారు. పినపాక నియోజకవర్గంలో మాత్రమే పంపిణీ చేసి, మిగిలినవి ఎన్నికల కోడ్‌తో నిలిపివేశారని, ఇప్పుడు వెంటనే పంపిణీ చేయాలని కోరారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

పాల్వంచరూరల్: యానంబైల్, మొండికట్ట తదితర గ్రామాల్లో గురువారం మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టులు హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారని, ఫలితంగా గిరిజనులు బలవుతున్నారని ఆరోపిస్తూ ఫొటోలను అందులో ముద్రించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు వాటిని పరిశీలించారు.

సింగరేణికే గనులు కేటాయించాలి


ధర్నా నిర్వహిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్స్ (ఎంఎండీఆర్) చట్టం 17 ఏ ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలకే బొగ్గు గనులు కేటాయించాలని ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి హెడ్డాఫీస్, జీఎం కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ మాట్లాడుతూ... సింగరేణిలో వేలం ద్వారా బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ చేస్తున్న కారణంగా సింగరేణి వ్యాప్తంగా ఈరోజు యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామని దానిలో భాగంగా కొత్తగూడెంలో చేపట్టామన్నారు. పదు డిమాండ్లను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆల్బర్ట్, పీతాంబరం, చిలక రాజయ్య, గోపు కుమార్, సత్తార్‌పాషా, మోహన్‌రెడ్డి, శనిగరపు కుమార్, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో సింగరేణి అంధకారం

బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని బొగ్గు గనులను వేలం ద్వారా ప్రైవేట్‌కు అప్పజెప్పుతోందని తద్వారా భవిష్యత్ కంపెనీ అంధకారంలో పడనుందని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి వై.గట్టయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

గురువారం ఏరియాలోని వీకే వర్క్‌షాపులో మాట్లాడుతూ.. ఈ వేలంపాట నిలుపుదల కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 5న కలెక్టరేట్ ముట్టడిని, నిరసన కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ఈనెల 6వ తేదీ నుంచి 12 వరకు సింగరేణిలోని జీఎం కార్యాలయం, హెడ్డాఫీసుల ఎదుట జరపతలపెట్టిన రిలే నిరాహార దీక్షలను కూడా కార్మికవర్గం అధిక సంఖ్యలో పాల్గొని విజవయంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆఫీస్ బేరర్ శ్రీనివాస్ మాట్లాడుతూ..

సింగరేణి సంస్థకు వేలం ద్వారా కాకుండా నేరుగా బొగ్గు బ్లాక్‌లు కేటాయించాలని, యూనియన్లకు అతీతంగా కార్మికులు సంస్థను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధు కృష్ణ, సందెబోయిన శ్రీనివాస్, గుమ్మడి మురళి, రాజ్ కుమార్, సాంబశివరావు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్‌కు సహకరించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: పని ప్రదేశాలలో 18 ఏళ్ల లోపు చిన్నారులుంటే వారిని ఎవరైనా తెలిసీ తెలియక పనిలో పెట్టుకుంటే నేరంగా పరిగణించాల్సి ఉంటుందని, వారికి ప్రభుత్వం విద్యాబుద్ధులు నేర్పించేందుకు హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో చేర్పిస్తామని డీఎస్పీ ఎస్.చంద్రభాను తెలిపారు. గురువారం ఇల్లెందులోని ఎస్‌డీఓపీ కార్యాలయంలో మాట్లాడారు. ఈ నెల 31 వరకు సబ్ డివిజన్‌లో ఆపరేషన్ ముస్కాన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఏడుగురు సభ్యులతో కూడిన అధికారుల బృందం పర్యటించి చిన్నారులను చేరదీస్తారని తెలిపారు. 18 ఏళ్ల లోపు వారు పనిలో ఉంటే యజమానిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. మాల్స్, హోటళ్లు, ఇటుకబట్టీలు, పెంకు పరిశ్రమలు, టైర్ల షాపుల్లో పనిచేసే వారిపై చైల్డ్ యాక్ట్ కేసులు నమోదవుతాయని తెలిపారు. నూతన చట్టాలు తీవ్రంగా ఉన్నాయని, కేసులు నమోదు అయితే బయటకు రావటం కష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇంకా గ్రామాల్లో పశువులు కాసేందుకు, వ్యవసాయ పనుల్లో బాలలు ఉన్నా వారిని కూడా హాస్టళ్లు, పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. చిన్నారులు పనుల్లో ఉంటే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు కానీ, 100కు కానీ కాల్ చేయాలని కోరారు.

'అమ్మ ఆదర్శ' పనులు త్వరగా పూర్తి చేయండి


పాల్వంచరూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచరూరల్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పనులను పక్షం రోజుల్లో పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి స్కూల్స్ హెచ్ఎంలను, సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈఓ, అధికారులతో ఎంపీడీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మల్లారం ప్రాథమిక పాఠశాలకు రూ.2.69 లక్షలు, నాగారంకాలనీ స్కూల్‌కు రూ.2.48 లక్షలు, తోగ్గూడెం స్కూల్‌కు రూ.2.79 లక్షలు, గాజులగూడెం స్కూల్‌కు రూ.2.85 లక్షలు, కొత్తూరుపేట చెరువు స్కూల్‌కు రూ.2.64 లక్షలు నిధులతో మైనర్, విద్యుత్ మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, టైల్స్ నిర్మాణం పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ శ్రీరామ్మూర్తి, ఐటీడీఏ ఏఈఈ శ్రీకాంత్, ఏపీఎం రాంబాబు, ఐటీడీఏ ఎస్‌సీఆర్‌పీ, ఎం.పాపారావు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం 51 పాఠశాలల్లో మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయని, ఆయా చోట్ల త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. తాజాగా ఐటీడీఏ పరిధిలోని 14 ప్రాథమిక పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు. మూడు రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఈ రాజు, సూర్నపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనంతారంలో వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అనంతారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని పలువురు జ్వరం బారిన పడటంతో అప్రమత్తమైన పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలకు డాక్టర్ వెంకటేశ్వర్లు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారిని గుర్తించినట్లు చెప్పారు. 96 మందికి వైద్యపరీక్షలు నిర్వహించామని, జ్వరంతో బాధపడుతున్న ఆరుగురి రక్త నమూనాలను వైద్యసిబ్బంది సేకరించినట్లు చెప్పారు. గ్రామంలో ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ రామారావు, వైద్యసిబ్బందితో పర్యటించి గృహాలను సందర్శించినట్లు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమార్, ఏఎన్ఎం సావిత్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నిరాహార దీక్ష

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన, తెలంగాణ బొగ్గు బ్లాక్‌ల వేలంపాట, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నామని ఆ సంఘం జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దీక్ష ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించబడుతుందని, సింగరేణిలోని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏరియా సందర్శన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాను జీఎం ఈఅండ్ఎం (సీహెచ్‌పీ) ఎం.తిరుమలరావు గురువారం సందర్శించారు. ఇటీవల పదోన్నతి పొందిన జీఎం ఏరియాకు తొలిసారిగా ఏరియాను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం శాలేంరాజు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భగా తిరుమలరావు సీహెచ్‌పీ పనితీరుపై ఏరియా ఇంజనీర్ వి.దుర్గాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏరియాలో ఏరోజు ఉత్పత్తి అయిన బొగ్గును ఆరోజే రవాణా చేయాలన్నారు. ఎస్‌ఓటూ జీఎం జీవీ కోటిరెడ్డి, ఏజీఎం (ఈఅండ్ఎం) వి.దుర్గాప్రసాద్, జీకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.శ్రీరమేష్, డీజీఎం సర్వే సదానందం, ఎస్ఈ (ఈఅండ్ఎం) బి.మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఔటర్ రింగ్‌రోడ్డు చరిత్రాత్మకం

పాల్వంచరూరల్: కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు రూ.450 కోట్ల వ్యయంతో ఔటర్ రింగ్‌రోడ్డును మంజూరు చరిత్రాత్మకమని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. జగన్నాథపురం గ్రామంలో గురువారం మండల అధ్యక్షుడు కొండం వెంకన్న అధ్యక్షతన మండల స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. కొత్వాల మాట్లాడారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, కొండం పుల్లయ్య, చేవుగాని పాపారావు, బాదర్ల జోషి, గంధం నర్సింహారావు, పెండ్లి రాంరెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న మాలోత్ శంకర్ తన ఇంటి వద్ద నెలరోజుల క్రితం జారి పడటంతో రెండుకాళ్లు విరిగి విధులకు హాజరు కావడం లేదు. విషయం తెలుసుకున్న సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఉద్యోగులు సేకరించిన రూ.23,400లను డీజీఎం పి.రాజశేఖర్ గురువారం శంకర్ సతీమణికి అందజేశారు.

ప్రమాద బీమాపై అవగాహన


మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఒప్పంద కార్మికులకు ప్రమాద బీమాపై సింగరేణి ఏరియా జీఎం జాన్‌ఆనంద్ అవగాహన కల్పించారు. గురువారం ఇల్లెందు జీఎం కార్యాలయం వద్ద బ్యాంక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం, ఇతర బీమా పథకాలపై అవగాహన అవసరం అన్నారు. కార్మికులకు ఆయా బ్యాంకుల వల్ల లాభనష్టాలను అధికారుల దృష్టికి తీసుకుని రాగా వారికి అవగాహన ద్వారా నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ కార్తీక్, డీజీఎం(పర్సనల్) జీవీ మోహన్‌రావు, అధికారులు ధనుంజయ్‌రెడ్డి, మహేష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు జే.వెంకటేశ్వర్లు, ఇతర ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు పాల్గొన్నారు.

భద్రాచలం అస్థిత్వాన్ని కాపాడండి..

సింగరేణి(కొత్తగూడెం): దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం ప్రాంత అస్థిత్వాన్ని కాపాడే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, అభివృద్ధికి ఆటంకంగా మారిన విభజనపై కేంద్రం ప్రభుత్వం స్పందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. ఆంధ్రాలో విలీనం చేసిన కన్నాయిగూడెం, ఎటపాక, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల పంచాయతీలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలో విలీనం చేయాలనే అంశంపై గురువారం శేషగిరిభవన్‌లో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొనసాగాల్సిన ఐదు పంచాయతీలను విడదీసి తీరని అన్యాయం చేశాసినట్లు వాపోయారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలలో ముడిపడి ఉన్న ఈ ప్రాంత ప్రజలను ఏకపక్షంగా వేరుచేసి భద్రాచలం డివిజన్ మూడు మండలాలకు పరిమితం చేశారని విమర్శించారు. పంచాయతీల విలీనం గురించి ప్రజలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవటం దుర్మార్గం అన్నారు. భద్రాచలం అభివృద్ధికి, ఈ ప్రాంత గిరిజనుల సంక్షేమానికి ఆటంకంగా మారిన ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని, భద్రాచలం అభివృద్ధికి రూ.వందకోట్ల బడ్జెట్ కేటాయించాలని, ఈ బడ్జెట్ సమావేశాల్లో ఐదు పంచాయతీలను తెలంగాణలో కలుపుతూ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు.

కొమరయ్య స్ఫూర్తితో పోరాటాలు చేద్దాం..


నివాళులర్పిస్తున్న నాయకులు


పాల్వంచరూరల్: నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో భూమి, భుక్తి, విముక్తి పోరాటాలను తీవ్రతరం చేద్దామని, రైతు వ్యతిరేక చట్టాలను ప్రతిఘటిద్దామని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు బానోత్ ఊక్లా అన్నారు. గురువారం కొత్తగూడెంలోని పెన్షనర్ల కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతిని ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. భూమి, భుక్తి పోరాటాలు నిత్యపోరాటాల స్ఫూర్తి దొడ్డి కొమరయ్య నాటి నిజాం సంస్థాన తెలంగాణ ప్రాంతంలో నిజాం నిరంకుశ పాలనను, దొరల, భూస్వాముల దౌర్జన్యాలను ఎదిరిస్తూ ఆంధ్ర మహాసభ నాయకత్వాన ప్రజలు తిరుగుబాటు చేశారన్నారు. తెలంగాణ ప్రాంతమంతా నిరసన జ్వాలలు రగులుతున్న సమయాన జనగామ తాలుకా కడవెండి గ్రామంలో విసునూరు దొరకి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రదర్శనలో ముందు నిలిచిన కొమరయ్య 1964 జూలై 4న అమరుడయ్యారన్నారు. ఆయన స్ఫూర్తితో నేటితరం యువత ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పరబోయిన రామ్మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి, దొడ్డి కొమరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాజీ సీఎం జయంతి వేడుకలు


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

ఇల్లెందు: దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జన్మదిన వేడుకలను గురువారం ఇల్లెందులో ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం పేద విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రుల అను, పల్లెర్ల చంద్రశేఖర్, కండె రమేష్, తాటిపల్లి సుబ్బారావు, పసుమర్తి వాసు, గోరంట్ల విజయ్, శంకర్, రాకేష్, బసవయ్య, పుల్లఖండం సుబ్బారావు, చందా చక్రధర్, సతీష్, సైఫా రాజశేఖర్ పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 91వ జయంతి వేడుకలను లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.డైమండ్‌రావు, వేమిశెట్టి శ్రీనివాస్, వెచ్చా శ్రీరాములు, కూర శ్రీధర్, చారుగుండ్ల నాగేశ్వరరావు, క్రాంతికుమార్, కుంట్ల సుధాకర్, రమేష్, వందనపు రాము, సాయిప్రసాద్ ఉన్నారు.

జూలూరుపాడు: తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా గురువారం జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సెక్రటరీ కొదుమూరి కోటేశ్వరరావు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. డాక్టర్లు పోటు వినోద్, తేజశ్వని, ఆర్యవైశ్య సంఘం నాయకురాలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి బొగ్గు బావుల వేలంపాటకు వ్యతిరేకంగా ఈనెల 5వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుప తలపెట్టిన ధర్నాలో అన్ని కార్మిక సంఘాలు జెండాలను పక్కన పెట్టి ఒకే ఎజెండాతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... వేలంపాటను రద్దు చేసేంత వరకు ఉద్యమాలను కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో ఇఫ్టూ కార్యదర్శి ఎస్‌కే యాకూబ్‌షావలీ, సహాయ కార్యదర్శి గోపాల్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

సూపర్‌బజార్(కొత్తగూడెం): అంగన్‌వాడీలు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీలు, హెల్పర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ... అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పడం వల్ల పోరుబాట పట్టాల్సి వచ్చిందన్నారు. గతంలో అంగీకరించిన విధంగా టీచర్‌కు రూ.రెండు లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. జీఓ నంబరు 10 రద్దు చేయాలని కోరారు. అత్యంత తక్కువ వేతనాలు ఇచ్చి జూలై 24 తరువాత ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ విషయంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క హామీలను నిలబెట్టుకోవాలని లేదంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.పద్మ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు విజయశీల, వీసభద్రమ్మ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్య, యూనియన్ నాయకులు పాయం రాధాకుమారి, మరియ, సూరమ్మ, కృష్ణవేణి, సారమ్మ, లలిత, నాగమణి, భాను, రాధ, హేమలత పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా మారిన విద్యావ్యవస్థ

మోదీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన విద్యాసంస్థల భారత్ బంద్ కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ప్రశాంతంగా ముగిసింది. జూనియర్ కళాశాల, కస్తూర్బా, హైస్కూల్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బంద్‌లో పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశంలో విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తోందని విమర్శించారు. నీట్ స్కామ్‌పై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా బంద్‌ను విచ్ఛిన్నం చేసేందుకు పోలీసులు గురువారం అర్ధరాత్రి నుంచే ఇళ్లల్లో ఉన్న విద్యార్థి సంఘాల నేతలను ముందస్తు అరెస్టులు చేయటాన్ని అఖిలపక్ష నేతలు తీవ్రంగా ఖండించారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: పాఠశాలలో ఆందోళన చేస్తున్న నాయకులు, విద్యార్థులు


సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు


జూలూరుపాడు హైస్కూల్ ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు, విద్యార్థులు


పాల్వంచ: మాట్లాడుతున్న అజిత్